క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ ధర్మా

చిట్యాల: చిట్యాల ఎస్‌ఐగా ఎస్.ధర్మా బుధవారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కాగా ఇప్పటివరకు చిట్యాల ఎస్‌ఐగా పనిచేసిన సైదాబాబు నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ ఎస్.ధర్మా మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉన్నా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

కనగల్ ఎస్‌ఐగా విష్ణుమూర్తి



కనగల్ : కనగల్ ఎస్‌ఐగా పి.విష్ణుమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విష్ణుమూర్తి సూర్యాపేట జిల్లాలోని డీఎస్‌బీలో పనిచేస్తూ కనగల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బొడిగ రామకృష్ణ నల్లగొండ వీఆర్‌కు అటాచ్ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విష్ణుమూర్తి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు.

డీఎస్‌యూ జిల్లా కన్వీనర్‌గా పెరిక సురేష్



నల్లగొండటౌన్: ధర్మ సమాజ్ పార్టీకి అనుబంధంగా ఏర్పడిన ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) జిల్లా కమిటీ సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌యూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా పెరిక సురేష్ ఎన్నికయ్యారు. కో కన్వీనర్లుగా శ్రవణ్, గురువీర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పట్ల పోరాటం చేస్తానన్నారు. డీఎస్‌యూ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తలారి లింగయ్య, సుభాష్, యశ్వంత్, కిరణ్, శంకర్, లోకేష్, దిలీప్, విజయ్, చిన్ని పాల్గొన్నారు.

నేటి నుంచి లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ

నల్లగొండ: జిల్లాలోని ఆహారభద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుదారులకు గురువారం నుంచి చౌకధరల దుకాణాల ద్వారా ఉచితంగా రేషన్ బియ్యం పంపణీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు బు ధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీ ల ర్లు తప్పనిసరిగా గురువారం నుంచి కార్డుదా రులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే



సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజు

చండూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు చండూరు మున్సిపల్ పరిధిలో మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం కూడా ఫీవర్ సర్వే కొనసాగుతోంది. నాలుగు రోజులుగా 5531 మందిని సర్వే చేయగా 43 మంది జ్వరపీడితులను గుర్తించారు. వారికి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. జ్వరపీడితులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. సర్వేను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజు పర్యవేక్షిస్తున్నారు.

ఎస్‌ఐ క్రాంతికుమార్‌కు సన్మానం

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన దగ్గుల క్రాంతికుమార్‌ను బుధవారం మండలంలోని పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మల్గ బాలకృష్ణ, నూకల శంకర్, పుల్లెంల అచ్చాలు, దూదిమెట్ల సత్తయ్య, మాజీ ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, వాజిద్ అలీ, మాజీ ఉప సర్పంచ్ శంకర్‌రెడ్డి, గడ్డం పశుపతి, సట్టు సత్తయ్య, ప్రజ్ఞాపురం సత్తి ఉన్నారు.

ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం

నకిరేకల్ : చేనేత కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీకి బుధవారం స్థానిక చేనేత, పద్మశాలి సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చిలుకూరి లక్ష్మీనర్సయ్య, గోలి పద్మ, గంజి యల్లయ్య, చిలుకూరి సుధాకర్, జిల్లా లక్ష్మీనారాయణ, పెండెం గణేశ్, మూడుదుడ్ల శ్రీను, చిలుకూరి అనంతరాములు, చక్రపాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రారంభానికి మటన్ మార్కెట్ సిద్ధం

- మంత్రి చొరవతో కోర్టు కేసు కొలిక్కి తెచ్చిన అధికారులు
- పూర్తి కావొచ్చిన నిర్మాణ పనులు



మటన్ మార్కెట్ భవన సముదాయం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలోని ప్రకాశం బజారు ఇందిర రోడ్‌లో యాభై ఏళ్ల నుంచి ఉన్న భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న మటన్ మార్కెట్ భవనం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దాదాపు పనులు పూర్తయి మార్కెట్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఆరేడేళ్లుగా ఎదురుచూస్తున్న మాంసం విక్రయ వ్యాపారులకు మటన్ మార్కెట్ భవనం అతి త్వరలో అందుబాటులోకి రానుంది. మిగిలిఉన్న చిన్నచిన్న పనులను పూర్తి చేసి త్వరలోనే భవనాన్ని ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్ భవనం ప్రారంభమైతే పట్టణంలో ఎక్కడపడితే అక్కడ రహదారుల వెంబడి జరుగుతున్న మాంసం విక్రయాలు కొంతమేర తగ్గే అవకాశం ఉంది.

మంత్రి చొరవతో..

పూర్వం నుంచి ప్రకాశం బజారు ఇందిర రోడ్‌లో మటన్ మార్కెట్ ఉంది. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి దాని స్థానంలో అన్ని హంగులతో మటన్ మార్కెట్ భవన నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులు గతంలో నిర్ణయించారు. శంకుస్థాపన చేసిన కొన్నాళ్లకే కొందరు స్థానిక వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో భవన నిర్మాణ పనులు ఐదారేళ్లకు పైగానే నిలిచిపోయాయి. కోమటి వెంకట్‌రెడ్డి మంత్రి అయ్యాక కోర్టులో ఉన్న కేసును తొలగించే విధంగా అధికారులు, వ్యాపారులతో మాట్లాడి కేసును కొలిక్కి తీసుకువచ్చారు. దాంతో మటన్ మార్కెట్ భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగించడంతో పనులు దాదాపు పూర్తయ్యాయి.

రూ.70 లక్షలతో మటన్ మార్కెట్ భవనం...

ప్రకాశం బజారు ఇందిర రోడ్‌లో మటన్ మార్కెట్ భవనాన్ని అన్ని హంగులతో నిర్మించారు. రూ.70 లక్షల వ్యయంతో భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీట్‌మార్కెట్‌లో రూ.6.50 కోట్లతో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మించారు. కానీ అక్కడ దేవాలయం ఉండడంతో స్థానిక ఆర్య వైశ్యులు మటన్ మార్కెట్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మటన్ మార్కెట్ అక్కడి నుంచి తొలగిస్తానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మటన్ మార్కెట్ తొలగించారు. ప్రకాశం బజారులో పూర్వం నుంచి ఉన్న మటన్ మార్కెట్ స్థలంలోనే కొత్త భవన నిర్మాణం పూర్తి చేయించారు. బయట డ్రెయిన్ పూర్తి చేసిన తరువాత మటన్ మార్కెట్‌ను ప్రారంభించే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ నిర్మాణంతో వ్యాపారులకు, వినియోగదారులకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది.

త్వరలో మార్కెట్ ప్రారంభిస్తాం



ప్రకాశం బజారులోని ఇందిర రోడ్‌లో మటన్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తి అయింది. చిన్నచిన్న పనులు ఉంటే పూర్తి చేస్తున్నాం. త్వరలోనే మటన్ మార్కెట్ భవనం ప్రారంభిస్తాం.

–సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



కుట్టు మిషన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం లయన్స్‌క్లబ్ నల్లగొండ సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్‌లు, జామెట్రీ బాక్స్‌లు, రెండు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ వైస్ గవర్నర్ కేవీ ప్రసాద్, రీజినల్ చైర్‌పర్సన్ అమంచి రాజలింగం, జోనల్ చైర్‌పర్సన్ చిలుకూరి రామకృష్ణ, కోఆర్డినేటర్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి, డాక్టర్ పుల్లారావు, వీరవెల్లి సత్యనారాయణ, పొన్నం రవీందర్, సుంకరి భిక్షంగౌడ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మునుగోడు : చెక్కు అందజేస్తున్న నాయకులు

మునుగోడు: అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన చల్మెడ గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, కొంక శంకర్, చంద్రయ్య, పగిళ్ల శ్రీరాములు, గౌరీశంకర్, స్వామి, పరమేష, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన అయిలి పెద్దయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయనకు మంజూరైన రూ.29,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీజేపీ మండల నాయకుడు పానుగోటి దామోదర్‌రావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటంపేట అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో 31 మంది సిబ్బంది బదిలీ

రామగిరి(నల్లగొండ): సాధారణ బదిలీల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో పనిచేస్తున్న 31 మంది సిబ్బంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో వివిధ సబ్జెక్టుల అసిస్టెంట్ ప్రొఫెసర్లు 22 మంది, 9 మంది ఆఫీసు సిబ్బంది ఉన్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కెమిస్ట్రీ సబ్జెక్టులో సీహెచ్. ముత్తయ్య నారాయణగూడ బీజేఆర్ ప్రభుత్వ కళాశాలకు, డాక్టర్ బాల స్వామి నారాయణగూడ బిజేఆర్ కళాశాలకు, కె.నాగిరెడ్డి కోదాడకు, ఆర్.చంద్రశేఖర్ నాంపల్లి, వై.యాదగిరిరావు ఖైరతాబాద్, వి.శ్రీనివాసులు చంచల్‌గూడకు బదిలీ అయ్యారు. ఎకనామిక్స్ డి.నారాయణరావు ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాలకు, డాక్టర్ కె.లక్ష్మణ్‌రావు హైదరాబాద్ సిటీ కాలేజీకి బదిలీ అయ్యారు. తెలుగు విభాగంలో డాక్టర్ ఎస్.దీపిక నారాయణగూడ బీజేఆర్ కళాశాలకు, డాక్టర్ వి.వి. సుబ్బారావు ఖైరతాబాద్, డాక్టర్ టి.కృష్ణయ్య రామన్నపేట, ఎస్.లవీందర్‌రెడ్డి ఖైరతాబాద్‌కు బదిలీ అయ్యారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో ఈ.యాదగిరిరెడ్డి హయత్‌నగర్, డాక్టర్ శీలం యాదగిరి మల్కాజ్‌గిరి, జువాలజీ విభాగంలో ఎస్.శ్రీనాథ్‌పటేల్ నారాయణగూడ బీజేఆర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డాక్టర్ ఎన్. వేణు కూకట్‌పల్లికి బదిలీ అయ్యారు. కామర్స్ విభాగంలో ఆర్.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూకట్‌పల్లి, ఫిజిక్స్ విభాగంలో జి.శ్రీనివాస్ నకిరేకల్‌కు, "ఫిజికల్ డైరెక్టర్ కె.మల్లేష్ ఖైరతాబాద్‌కు, హిస్టరీ విభాగంలో కె.ప్రవీణ్‌రెడ్డి నకిరేకల్‌కు, మాథ్స్ విభాగంలో ఎన్.నర్సింహ హయత్‌నగర్‌కు బదిలీ అయ్యారు. లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్ హయత్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆఫీసు సిబ్బంది ఏ. వెంకట్‌రెడ్డి (హెర్బేరియం కీపర్), ఎండీ.సలావుద్దీన్ (రికార్డు అసిస్టెంట్), టి.క్రాంతికుమారి (స్టోర్ కీపర్), పి.మధు (రికార్డ్ అసిస్టెంట్), ఎస్.వెంకట్‌రెడ్డి (రికార్డ్ అసిస్టెంట్), ఎహబిన్ అమర్ (మ్యూజియం కీపర్) దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. కె. సుదర్శన్ (రికార్డ్ అసిస్టెంట్) నకిరేకల్, ఎండీ. ముస్తఫా అలీ (ఏఓ) నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని సత్యనారాయణ కాలనీలో మున్సిపాలిటీకి చెందిన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన షెడ్డును బుధవారం మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. ఓ వ్యక్తి అక్రమంగా షెడ్డు వేసి కబ్జా చేస్తున్నాడనే ఫిర్యాదు అందడంతో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. అనంతరం కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంచర్‌లు చేసినప్పుడు మున్సిపాలిటీకి పది శాతం స్థలం కేటాయించాల్సి ఉంటుందని, ఈ స్థలం మున్సిపాలిటీల ఆధీనంలో ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు.

సంత స్థలం ఇలా.. వ్యాపారం చేసేదెలా !



బురదమయంగా మారిన కూరగాయల సంత

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో ప్రతి గురువారం వారాతపు సంత జరుగుతోంది. కానీ ఆ సంత స్థలం అంతా అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షం వస్తే చాలు.. బురద గుంతను తలపిస్తోంది. వారాంతపు సంతలో వివిధ రకాల వ్యాపారులు కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతోపాటు ఇతర వస్తువులను విక్రయించేందుకు వస్తారు. ఆ వస్తువులు కొనుగోలు చేసేందుకు మండలంలోని 26 గ్రామాల ప్రజలతోపాటు చండూరు, చిట్యాల, నల్లగొండ మండలాల ప్రజలు సైతం వస్తారు. సంతను మునుగోడు బస్టాండ్ ఎదురుగా ఉన్న గ్రామ పంచాయతీ స్థలంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వారాంతపు సంత ద్వారా ప్రతి ఏడాది రూ.1.50 లక్షల ఆదాయం కూడా గ్రామ పంచాయతీకి వస్తోంది. సంత నిర్వహణ బాధ్యతలు టెండర్ పద్ధతిన ఒకరికి అప్పగించారు. వేలం పాడిన ఆ వ్యక్తి సంతలో వ్యాపారుల నుంచి రూ.30 చొప్పున ప్రతి వారం వసూలు చేసుకుంటాడు. అలా సంతలో వ్యాపారం చేసే దాదాపు 150 మంది వ్యాపారుల నుంచి వారం వారం రూ.4500 పైగా ఆదాయం పొందుతున్నాడు. కానీ సంత జరిగే స్థలంలో సౌకర్యాలు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు సంత స్థలం అంతా బురదగుంతలా మారిపోతోంది. సాయంత్రం సమయం వరకు సంత కొనసాగుతుందని తెలిసి కూడా ఆ స్థలంలో కనీసం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం లేదు. సంబంధిత అధికారుల స్పందించి వారాంతపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



నల్లగొండ క్రైం: అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం: నేర రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందుకు రావాలని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని డాన్‌బాస్కో పాఠశాలలో గంజాయి మాదకద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని, వారికి నచ్చిన రంగంలో ఎదగాలని, ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేరాలను అరికట్టడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 100కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బంది జానీపాషా, మహమూద్, సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ బాలశౌరిరెడ్డి, ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షీటీంపై విద్యార్థులకు..

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని అక్కెనపల్లి హైస్కూల్లో జిల్లా షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తే వెంటనే షీటీంకు తెలియజేయాలని షీటీం సభ్యుడు నరసింహ సూచించారు. మహిళల భద్రతపై రాజీ పడకుండా, నేరస్తులకు వ్యతిరేకంగా నిలబడి మాట్లాడే వారిలో విశ్వాసాన్ని నింపేందుకు షీటీం ప్రయత్నిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నడింపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 31వ ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు బుధవారం ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ నాయబ్ సుబేదార్ సోహన్లాల్ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌కు చెందిన 37 మంది విద్యార్థులు ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ శిక్షణ పూర్తి చేసుకోవడంతో సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి శీలం భద్రయ్య, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

అరెస్టులు అప్రజాస్వామికం

నల్లగొండ టౌన్: సివిల్ సప్లయ్, ట్రాన్స్‌పోర్టు తదితర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో లెనిన్, డి వెంకన్న, యాదయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, శ్రీను, రవి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

చండూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా పిలుపు మేరకు చండూరు మండలం నుంచి మహిళా మోర్చా నాయకురాళ్లు హైదరాబాద్‌కు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. అరెస్ట్ అయిన వారిలో మహిళా మోర్చా అధ్యక్షురాలు తడకమళ్ల అశ్విని, ప్రధాన కార్యదర్శి కటకం ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు లావణ్య కార్యకర్తలు లక్ష్మీ, మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

చిట్యాల: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఉరుమడ్ల గ్రామంలోని సంక్షేమ హాస్టల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ హాస్టల్‌లో వాటర్ ట్యాంకుకు వెంటనే మరమ్మతులు చేయించాలని, జనరేటర్ సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు రవి, మండల కార్యదర్శి బొడ్డు బాబురావు, గాదె ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప చెట్లల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



శాలిగౌరారంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన కంపచెట్లు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని శాలిగౌరారం–గురుజాల ప్రధాన రోడ్డువెంట ఉన్న ఎస్‌ఎస్–12 నంబర్ గల 100 హెచ్‌పీ విద్యుత్‌త్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా కమ్మేశాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను కొన్ని తీగజాతి మొక్కలు అల్లుకుపోవడంతోపాటూ కంపచెట్ల కొమ్మలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై తరచూ ఫ్యూజ్ కొట్టేస్తోంది. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్‌ఆఫ్ చేసేందుకు ఏబీ స్విచ్ కూడా లేకపోవడం గమనార్హం. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి తాగునీటిని అందించే గ్రామపంచాయతీకి చెందిన బోరుతోపాటూ మరో 15 వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. చెట్లు కమ్మేయడంలో తరచూ ఫ్యూజ్ కొట్టేస్తోంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం అటు మార్కెట్‌కాలనీ ప్రజలు, సాగునీటి కోసం ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి ఏబీ స్విచ్‌ను కూడా అమర్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు



రాంరెడ్డిని సన్మానిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కేతేపల్లి: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు తప్పక గుర్తింపు లభిస్తుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ అసిస్టెంట్ కేసాని రాంరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రాంరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు యాట మధుసూదన్‌రెడ్డి, నపలరాజు వెంకన్న, హెచ్‌ఎం నర్సిరెడ్డి, బి.మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుంకరి భిక్షంగౌడ్‌కు సన్మానం



భిక్షంగౌడ్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు సుంకరి భిక్షంగౌడ్ పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరిన సందర్భంగా చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం యూనియన్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ కుకుంట్ల నర్సింహ, హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ సైదానాయక్, జాన్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి గోలి స్లీవమ్మ, అంబటి సత్తయ్య, సుధాకర్‌రెడ్డి, బాదం భిక్షపతి, పోలె వెంకటయ్య, సత్తయ్య, రెబల్లె శరత్, భాస్కర్‌గౌడ్, మాధవరెడ్డి, నాగరాజు, కరుణాకర్, సైదులుగౌడ్, మురళి, సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ శక్తి సూపర్ షీ సమావేశం

నల్లగొండ టౌన్: యూత్ కాంగ్రెస్ శక్తి సూపర్ షీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ ధ్వని- 2024 సమావేశాలు ఢిల్లీలో రెండు రోజులపాటు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన వడ్డేపల్లి ఎల్లోర తన ముత్తాత, నల్లగొండ మాజీ ఎంపీ వడ్డేపల్లి కాశీరాం .. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి దిగిన ఫొటోను బుధవారం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ అల్వాల్ కృష్ణకు బహూకరించారు. కార్యక్రమంలో శక్తి సూపర్ షీ స్టేట్ కోఆర్డినేటర్ కుంతల శ్రీవిద్యారెడ్డి, నల్లగొండ పార్లమెంట్ శక్తి సూపర్ షీ నాయకురాలు వడ్డేపల్లి ఎల్లోర, జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ తాటిపర్తి వినూత్నరెడ్డి పాల్గొన్నారు.



చిత్రపటాన్ని బహూకరిస్తున్న వడ్డేపల్లి ఎల్లోర

రేపు మాస కల్యాణం

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 10 గంటలకు రుద్ర హోమం, 11 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కనగల్ : దోరెపల్లి గ్రామంలోని 199 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని ఎస్సీలకు, బీసీలకు బంచరాయి పట్టా పాస్ బుక్‌లు ఇచ్చినట్లు, తమకు కూడా ధరణి పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని బుధవారం తహసీల్దార్ పద్మకు దోరెపల్లి రైతులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూములు పంచాయతీలో ఉంటే పార్ట్ బి లో పెట్టాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశించగా.. అప్పటి అధికారులు 199 సర్వే నంబర్లో ఉన్న చిన్న సమస్యను పరిష్కరించకుండా పార్ట్ బి లో పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దాసరి వెంకన్న, రైతులు బైరగోని శేఖర్‌గౌడ్, ఏమిరెడ్డి రవీందర్ రెడ్డి, ఆదిముల వెంకన్న, బైరగోని కృష్ణ గౌడ్, కిన్నెర విజయ్, దాసరి విజయ్, గాజుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చండూరు : మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రెండో వార్డు కౌన్సిలర్ కీర్తి సంజయ్ బుధవారం మున్సిపల్ కమిషనర్ మణికరన్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద, వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

అంధకారంలో మునుగోడు పట్టణం



వీధిలైట్లు వెలగక చీకట్లు కమ్ముకున్న మునుగోడు ప్రధాన కూడలి

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడు అంధకారంలో మునిగిపోయింది. గ్రామంలోని వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటికి లైట్లు లేకపోవడంతో ఏ కాలనీలో చూసినా చీకటిమయంగా కనిపిస్తోంది. ప్రధాన కూడలి అయిన అంబేద్కర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు ఉన్నప్పటికీ అవి కాలిపోయాయి. సంబంధిత అధికారులు తిరిగి లైట్లు వేయకపోవడంతో ఆ కూడలి అంతా రాత్రి వేళల్లో చిమ్మ చీకటి కమ్ముకుపోతోంది. గ్రామ పంచాయతీ సిబ్బందిని వీధి లైట్లు వేయాలని కోరితే నిధులు లేవని చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి మునుగోడు ప్రధాన కూడలితోపాటు వీధుల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ నాయకుడి మృతి

తిప్పర్తి: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు ఉప్పల కరుణాకర్(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కరుణాకర్ మృతదేహాన్ని మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.